


# పరదేశీ కథలు

## – చిట్టే సిద్ధ లలిత



- 111 -

## నిఖా

**చాలా హుషారుగా వున్నాడు సేటు హుస్సేన్.** సంతోషంతో అతని ముఖం వెలిగిపోతోంది. అరవైయేళ్ళ వయసులో ఆ రోజు అతను నాలుగోసారి నిఖా చేసుకుంటున్నాడు. తాతలు సంపాదించిన ఆస్తులు కుప్పలుగా మూలుగుతున్నాయి. పెట్రోలు బావుల్లో ఇంకని ఊటలు అతన్ని ఆగర్భ శ్రీమంతుని చేసాయి. దాంతో అతడు వ్యసనాలకు లోనయ్యాడు. అతనికున్న అమ్మాయిల పిచ్చి అతడ్ని రోగాల బారిన పడేసింది. అయినా అతడు తన పద్ధతిని మానలేదు. అరబ్బు సుందరీమణుల పొందు కోసం లక్షల దినారాలు ఖర్చు చేస్తాడు అతడు.
ప్రస్తుతం విదేశాల నుండి అమ్మాయిలను రప్పించడం రాత్రింబవళ్ళు సుఖ లాలసలో మునగడం అతని నిత్యకృత్యం. ప్రతి క్షణాన్ని ఆనందిస్తూ ఆస్వాదించడమే జీవిత పరమార్థం అనుకుంటాడు.

సేటు హుస్సేన్ చుట్టూ నలుగురు ఆవారాగాళ్ళు వుంటారు. వాళ్ళు అతనితో కలిసి తిరుగుతూ అతన్ని పొగుడుతూ వాళ్ళ పబ్బం గడుపుకుంటుంటారు. వీళ్ళే కాదు వీళ్ళ కారు డ్రైవర్లకూ వీరి పాపంలో భాగం వుంది. డబ్బు కోసం నానా గడ్డి కరుస్తారు వాళ్ళు.

ఇకపోతే ఈ సేటు భార్యలు ముగ్గురూ అతని గురించి పట్టించుకోకుండా బ్యూటీ పార్లర్ ల చుట్టూ తిరుగుతూ తమ సౌందర్యానికి మెరుగులు దిద్దుకోవాలని తాపత్రయ పడుతుంటారు. వారికి సేటు గురించి బాగా తెలుసు. అతనితో బాగా విసిగిపోయారు వాళ్ళు. అందుకే భర్త కాదు, అతనిచ్చే దినార్లు ముఖ్యం అనుకున్నారు ఆ భార్యలు. ఎవరి లోకం వారిదయింది. చాలావరకూ జీవితాలన్నీ పైన మెరుగులు పూసుకుని తళుక్కున మెరిసి మురిసి ముగిసేవే. జీవితం ఒక నాటక రంగం.

కువైట్ దేశంలోని శ్రీమంతులైన షేకులు నాలుగు పెళ్ళిళ్ళు చేసుకొని నాలుగు కాపరాలు పెట్టుకోవడం పెద్ద వింతేమీ కాదు. వారికి కొత్తా కాదు. అందుకే ఈ పెళ్ళికి పెద్ద సంఖ్యలో బంధువులు, స్నేహితులు హాజరయ్యారు.

వారేకాదు, అతడి ముగ్గురు భార్యలు, వారి పిల్లలు, మనవలు కూడా ఎవరో, ఏమిటో చూద్దాం అన్న ఆత్రుత కొద్దీ అక్కడికి వచ్చారు. పరదా వెనక మొగ్గలాంటి పెళ్ళి కూతురు నాకీ పెళ్ళి వద్దు అంటూ ఏడుస్తోంది. బయట ముసలి పెళ్ళికొడుకు మద్యం తాగుతూ, తూలుతూ, ఆడుతూ, పాడుతున్నాడు.

పెళ్ళికి ముందు సంప్రదాయ నృత్యం ఒకటి వుంటుంది. మగవాళ్ళంతా కలిసి ఆటపాటలతో విందు వినోదాలతో, ఛలోక్తులతో సరదాగా గడుపుతారు. ఆడవాళ్ళ ఆటపాటలన్నీ తెర వెనుకే జరుగుతాయి. మగాళ్ళ ముందుకు రావడానికి అరబ్ స్త్రీలకు అనుమతి లేదు.

ప్రత్యేకమైన అలంకరణతో, అందమైన దుస్తుల్లో పెళ్ళి కూతురు మెరిసిపోతోంది. పనివారు ఆమె చుట్టూ షేకు హుస్సేన్ పంపిన విలువైన నగలు, బట్టలు, కానుకలను వుంచారు. ఛలోక్తులతో సరసమైన సంభాషణలతో ఆమెను నవ్వించాలని ప్రయత్నిస్తున్నారు. కానీ ఆమె సంతోషంగా లేదు. తలొంచుకుని ఏడుస్తోంది. ఇరవైయేళ్ళు కూడా నిండని పసి మొగ్గ ఆమె. అరవై యేళ్ళ షేకును ఎలా ఇష్టపడుతుంది..?

వారిది ఇరాన్ నుండి కువైట్ కు వలస వచ్చిన పేద కుటుంబం. పన్నెండు మంది సంతానంలో ఈ అమ్మాయి ఆరవది. అందుకే అమ్మాయి నాన్న ఈ షేకుకు నాలుగో భార్యగా ఇచ్చి పెళ్ళిచేసి కన్యాశుల్కం కింద కావలిసిన సంపదను పొంది పేదరికం నుండి విముక్తుడ్ని కావాలి అని ఆశపడుతున్నాడు.

ఇస్లాం సంప్రదాయం ప్రకారం పెళ్ళికొడుకు అమ్మాయికి నగలు, డబ్బు, కానుకలెన్నో ఇచ్చి నిఖా నిశ్చయించుకుంటాడు. సాధ్యమైనంతవరకూ అమ్మాయిలను వీళ్ళు బయట ఉద్యోగాలకు పోనివ్వరు. పరపురుషుని కంట పడకుండా ఇంట్లో పని చూసుకోమంటారు.

స్త్రీ ధర్మం ప్రకారం పిల్లల్ని కని కుటుంబాన్ని వృద్ధి చేస్తే చాలు అనుకుంటారు. స్త్రీ సున్నితమయినది. ఆమె బయట ప్రపంచంలోకి వెళ్ళి ఎందుకు కష్టపడాలి..? బయట పరపురుషుల వేధింపులు, వంకర చూపులను ఎందుకు ఎదుర్కోవాలి..?

కుటుంబాన్ని పోషించడం పురుషుని బాధ్యత. ఇంటిని పిల్లల్ని చూసుకోవడం స్త్రీ బాధ్యత అంటారు వీళ్ళు. కానీ కాలం మారుతోంది. ప్రస్తుతం మార్పులు చోటు చేసుకుంటున్నాయి.

పెళ్ళికూతురు పేరు జీనత్. అమ్మాయి తాకితే పాలు కారేలా వుంది. నల్లని కనుదోయి ఏడ్వడంతో ఎర్రబారింది. ఇష్టంలేని పెళ్ళి కావడంతో గులాబిపువ్వులా ముడుచుకుని కూర్చుంది.

చుట్టూ చేరిన అమ్మలక్కలు "షేకు హుస్సేన్ కు బాగా డబ్బుందే పిల్లా.. ముసలాడయితే ఏమయింది..? మేడలు, బంగళాలు, కార్లు నీకుంటాయి. కాలు కందకుండా చూసుకోవడానికి నౌకర్లు నీకుంటారు. నాల్రోజులు మోజు తీరాక అతడు భార్యల గురించి పట్టించుకోడు. అయినా ఆ ముసలోడు ఎన్నేళ్ళు బ్రతుకుతాడు. అతడు చస్తే అంతులేని ఆస్తి నీ స్వంతమవుతుంది. మా మాట వింటే నువ్వు సుఖపడతావు" అంటూ నచ్చ చెబుతున్నారు.

"నాకొద్దీ పెళ్ళి. నేను ఖుబూల్ అనను గాక అనను" అంటూ మొండికేస్తోంది జీనత్. అమ్మాయి ఖుబూల్ అనకపోతే మౌల్వీ కూడా ఏమీ చేయలేడు. పెళ్ళి జరగదు.

అమ్మాయి నాన్న వచ్చి "ఒకసారి నీ అక్కలను, తమ్ముళ్ళను, చెల్లెళ్ళను చూడమ్మా. వాళ్ళ భవిష్యత్ కోసమైనా నువ్వు ఈ పెళ్ళి చేసుకోవాలమ్మా. నా మాట విను" అంటూ సముదాయిస్తున్నాడు.

"ఆ ముసలోడిని చూస్తే నాకు భయమేస్తోంది. నాకు పెళ్ళి వద్దు" అంటూ ఏడ్చింది జీనత్.

బిడ్డ బాధ చూసిన తల్లి కూడా జీనత్ తో పాటూ ఏడుపు మొదలు పెట్టింది.

ఈ ఏడుపులు వినబడటంతో హుక్కా పీల్చే షేకు హుస్సేన్ లేచి తూలుతూ "ఏమయింది ఎందుకు ఏడుస్తున్నారు" అంటూ అటువైపు వచ్చాడు. అతనితో పాటూ ముగ్గురు భార్యలు కూడా లోపలికి వచ్చారు.

మూడో భార్య కరిష్మ సరాసరి జీనత్ దగ్గరికి వచ్చి కన్నీళ్ళు తుడిచింది. "చెల్లీ నువ్వు బాధ పడకు అంటూ ఓదార్చింది.

అక్కా నాకీ పెళ్ళి వద్దు దయచేసి ఆపండి" అంటూ కరిష్మా చేతులు పట్టుకుంది.

"నా పెళ్ళి కూడా నాకిష్టం లేకుండా జరిగింది చెల్లీ. రాయిలాగా బ్రతుకుతున్నాను నేను. మా నాయన నన్ను వెయ్యి దినార్లకు ఈ సేటుకు అమ్మేసాడు. నేను ఒకరోజు రాత్రి ఖర్జూరం తోటల్లో పడి పరిగెత్తి పారిపోతుంటే కుక్కల్ని ఉసిగొల్పి పట్టుకున్నాడు వీడు. చిత్ర హింసలు పెట్టాడు. ఇక వీడంటే కంపరమైనా మనసు చంపుకుని లొంగక తప్పలేదు. అలాగే ఇద్దరు పిల్లలు కూడా పుట్టారు నాకు. కానీ రోజురోజుకూ వీడిపై కోపం పెరిగిపోతోంది. వీడికి తగిన శాస్తి చెయ్యాలని నిరీక్షిస్తున్నాను నేను. నీ బ్రతుకు నాలాగా కాకూడదు. మన తల్లిదండ్రులు వాడిచ్చే దినారాల కోసం మనల్ని అమ్మేస్తున్నారు. అడిగితే ఇస్లాం సాంప్రదాయమంటున్నారు. నువ్వు బాధపడకు. ఎలాగైనా నేను నిన్ను తప్పిస్తాను. నన్ను నమ్ము" అంటూ భుజం తట్టి బయటికి వెళ్ళిపోయింది.

కరిష్మా మాటల మీద జీనత్ కు పెద్దగా నమ్మకం కుదరలేదు. కరిష్మా బయటికి వెళ్ళి తన డ్రైవర్ ను పిలిచి మెల్లగా ఏదో చెప్పింది.

జీనత్ కు హసీనా అనే స్నేహితురాలు వుంది. ఆ అమ్మాయి కూడా నిరుపేద జోర్డాన్ కుటుంబం నుండి వచ్చింది.

"అరె జీనత్ ఎందుకు బాధ పడతావు. పేదరికం నుండి బయటపడి మహారాణిలాగా విలాసంగా జీవించే మంచి అవకాశమిది. సంతోషంగా వుండు" అంటూ బుజ్జగించింది.

"అయితే ఈ పెళ్ళి నువ్వు చేసుకోవే హసీనా" అంది జీనత్.

"నిజంగానే అంటున్నావా" నవ్వింది హసీనా.

"అవునే హసీనా ఏదో ఒక విధంగా నన్ను తప్పించి ఈ సేటు హుస్సేనును నువ్వు చేసుకోవే.. నాకు ఇక్కడి నుండి ఇప్పుడే పారిపోవాలని వుంది" అంటూ ఏడ్చింది జీనత్.

"అయితే ఒక ఐడియా" అంటూ చెవిలో గుసగుసలాడింది హసీనా.

"అలాగే చేద్దాం" అంటూ అంగీకారంగా తలూపింది జీనత్.

సేటుతో పాటూ అతని కొడుకులు కూడా పెళ్ళికూతురు వున్న చోటికి వచ్చారు. పెళ్ళి కూతురు తండ్రి బయటికి రావడంతో కాసేపు పరదా పక్కకు తొలగింది. కళ్ళు మిరుమిట్లు కొలిపే సౌందర్యం. అందమంతా రాశిగా పోసినట్లుంది జీనత్.

షేక్ హుస్సేన్ తో పాటూ అతడి కొడుకులు కూడా జీనత్ అందాన్ని చూసి ముగ్ధులయ్యారు.

షేక్ హుస్సేన్ కళ్ళు ఆశ్చర్యంతో విచ్చుకున్నాయి. అమాంతం వెళ్ళి ఆమె కాళ్ళముందు పడిపోయి దాసుడ్ని కరుణించమని అర్థించాలనుకున్నాడు. నిషా తలకెక్కింది. మత్తులో తూలుతున్నాడు. "జీనత్.. జీనత్ ఓ నా అందాలరాణీ" అని పిలుస్తూ పరదా తొలగించుకుని జీనత్ ముందు నిలబడ్డాడు. జీనత్ అతడ్ని అతడి వాలకాన్ని, ఆకారాన్ని చూసి జడుసుకుంది.

"హబీబ్తి జీనత్ నీకు నా యావదాస్తులూ రాసిస్తాను. నా సర్వస్వమూ అర్పిస్తాను. నన్ను కరుణించు" అంటూ కాళ్ళవద్ద కూలబడ్డాడు.

బయట మౌల్వీ పిలుస్తున్నాడు. సమయం మించిపోతోంది. పెళ్ళి కూతురు వచ్చి ఖుబూల్ అనకపోతే పెళ్ళి ఆగిపోతుంది.

బంధువులంతా చుట్టూ మూగారు. షేక్ హుస్సేన్ పిచ్చి పిచ్చిగా మాట్లాడుతూ కింద దొర్లుతున్నాడు.

ఎవరో వచ్చి అతని ముఖం మీద నీళ్ళు చల్లారు.

తెప్పరిల్లి లేచి నిలబడి "తొందరగా జీనత్ ను తీసుకురండి. ఈ సౌందర్యరాశిని పెళ్ళాడి నా స్వంతం చేసుకుంటాను" అంటూ బయటికి వెళ్ళిపోయాడు.

కాసేపటికి ముసుగులోని పెళ్ళికూతురు బయటికి వచ్చి పరదా వెనక కూర్చుంది. మౌల్వీ చెప్పినట్లు చేసింది.

పలకమన్నట్లు పలికింది. నిఖా సమ్మతమే అంటూ "ఖుబూల్ హై" అంది.

సేటు సంతోషించాడు. పెళ్ళి తంతు ముగిసింది. కానుకలన్నీ పెళ్ళికూతురి స్వంతం అయ్యాయి.

అంతా సజావుగా జరిగిందని అందరూ సంతోషించారు.

సేటు హుస్సేన్ ఆనందం అవధులు దాటింది. ఉత్సాహాన్ని పట్టలేక ఇక ఆగలేను ఇప్పుడే బురఖా తొలగించి నా రాణిని చూపించండి అని పట్టుపట్టాడు.

రాత్రి శోభనం గదిలో చూద్దువు అన్నా కూడా వినలేదు. ఇక విధిలేక అమ్మలక్కలు వచ్చి అడ్డుగా వున్న పరదా తీసి బురఖా తొలగించారు.

ముసుగులోపల వున్న అమ్మాయిని చూసి అందరూ నిర్ఘాంతపోయారు. అందరూ ఊహించినట్లు అక్కడ బురఖాలోపల పెళ్ళికూతురు స్థానంలో వున్నది జీనత్ కాదు. ఆమె స్నేహితురాలు హసీనా నింపాదిగా నవ్వుతూ కూర్చుని వుంది.

ముసుగులోని పెళ్ళికూతురు మారిపోయింది.

సేటు తేరిపారచూసాడు. "నా జీనత్ ఏదీ" అంటూ కోపంగా పైకి లేవబోయాడు.

మౌల్వీ తేరుకుని "ఏది ఏమైనా ఇప్పుడు ఈ అమ్మాయితో నిఖా జరిగిపోయింది. ఈ అమ్మాయే నీకు భార్య. తప్పదు నువ్వు ఆమోదించాలి" అని నచ్చచెప్పాడు.

సేటు లేచి నిలబడబోయి తూలిపోయి దబ్బున కింద పడ్డాడు. ఏనుగులాంటి భారీ ఆకారం. మరిక తిరిగి లేవలేదు. కోమాలోకి వెళ్ళిపోయాడు షేక్ హుస్సేన్. అతన్ని హాస్పిటల్ కు తరలించారు. సేటు బంధువులు కొందరు బాధపడ్డారు. కొందరు బాగా అయిందిలే ఈ వయసులో నాలుగో నిఖా అవసరమా అనుకుంటూ సంతోషించారు.

పక్కనే వున్న జీనత్ తండ్రి నిర్ఘాంతపోయాడు. పెళ్ళికూతురి అలంకరణలో వున్న హసీనా కేసి దిగులుగా చూస్తున్నాడు. షేక్ హుస్సేన్ ఇచ్చిన కట్నం, కానుకలన్నీ తిరిగి ఇవ్వాలో వుంచుకోవాలో తెలియని సంధిగ్దం అతనిలో.

ముందే పేదవాడు. ఇప్పుడు ఈ పరిస్థితిని ఎలా ఎదుర్కోవాలో తనకు అనుకూలంగా ఎలా మలుచుకోవాలో అని ఆలోచిస్తున్నాడు. అనుబంధాలన్నీ ఆర్థిక అవసరాలుగా మారిపోతున్నాయ్. లోపల గదిలో దాగివున్న జీనత్ అప్పుడు సంతోషంగా బయటికి వచ్చింది. పీడా వదిలింది. తిక్క కుదిరింది ముసలాడికి అని మనసులో అనుకుంది.

మౌల్వీ ముందుకొచ్చి జీనత్ ను ఉద్దేశించి "ఈ పెళ్ళి కూతురు కూడా సిద్ధంగా వుంది. ఒకసారి వివాహం కోసం అలంకరించుకున్న వధువు పెళ్ళి ఆగకూడదు. మీలో ఎవరైనా ఆమెను వివాహం చేసుకునే అభిప్రాయం వుంటే ముందుకు రండి ఇప్పుడే ఇక్కడే పెళ్ళి జరిగిపోవాలి" అని గట్టిగా అరిచాడు.

అందరూ ఊపిరి బిగపట్టారు. అంతలో షేక్ హుస్సేన్ రెండోభార్య కొడుకు హమద్ ముందుకొచ్చాడు. యువకుడు కోరమీసంతో నిలువునా జిద్దాషా, తలపై ఖతరా ధరించి చూడముచ్చటగా వున్నాడు.

"మా నాన్న చేసిన పొరపాటును నేను సరిదిద్దుతాను. జీనత్ జీవితం అగమ్యం కాకూడదు. ఆమెకు ఖుబూల్ అయితే నేను ఇప్పుడే నిఖా చేసుకుంటాను" అన్నాడు.

జీనత్ పెదవులు చిరునవ్వుతో విచ్చుకున్నాయి. జీనత్ తండ్రి కూడా సంతోషించాడు. అప్పుడే అక్కడే ఆ నిముషంలో హమద్, జీనత్ల నిఖా జరిగిపోయింది. దంపతుల ఈడూజోడూ బావుందని కలకాలం కలిసి కాపురం చేస్తూ పిల్లా పాపలతో వర్థిల్లమని అందరూ ఆశీర్వదించారు.

దాదాపు రెండునెలలు హాస్పిటల్లో బెడ్ మీద కోమాలో వున్న సేటు ఒకరోజు ప్రాణం వదిలేసాడు. ఇక్కడ ఎవరికీ తెలియని రహస్యమొకటుంది.

సేటు ఎందుకు కోమాలోకి వెళ్ళాడు, ఆ తరువాత ఎందుకు చనిపోయాడు అనేది అతని మూడో భార్య కరిష్మాకు ఆమె డ్రైవర్ కు మాత్రమే తెలుసు. తాగే గ్లాసులో డ్రైవర్ ఏదో పొడిని కలపడం సేటు గమనించలేదు. ఎంతో మంది ఆడపిల్లలతో ఆడుకున్న సేటు కథ అలా ముగిసింది.

ఇటు హసీనాకు సేటు ఆస్తుల్లో తన వంతు భాగం దొరికి ధనవంతురాలయింది. తరువాత తనకు నచ్చిన వ్యక్తిని చూసి పెళ్ళి చేసుకుని స్థిరపడింది.

జీనత్, హమద్ ల జంట కూడా పిల్లా పాపలతో సంతోషంగా జీవించారు.

*(మరోకథ వచ్చేనెలలో)*

Post your comments